ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శనివారం 30 మార్చి 2024



రాజకీయ దిగ్గజాలకు నిలయం

తెనాలి నియోజకవర్గం నుంచి గెలుపోటములు పొందిన దిగ్గజాలుకూడా ఉన్నారు. ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు ఇక్కడ పోటీ చేశారు. నాదెండ్ల భాస్కరరావు 1989లో ఇక్కడి నుంచి గెలిచారు. 1994లో రెండోసారి పోటీచేసి ఓటమి పాలయ్యారు. 1999లో మరో మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు గవర్నర్‌గా చేసిన కొణిజేటి రోశయ్య తెనాలి నుంచి పోటీచేసి గోగినేని ఉమ చేతిలో ఓటమి చెందారు. తెనాలికి రాజకీయంగానే కాకుండా కళాపరంగానూ ఎందరో ప్రముఖులున్నారు. రాజకీయ రంగం తర్వాత తెనాలి కళలకు ప్రసిద్ధి. సినీ రంగంలో ఎందరో ప్రముఖులు నియోజకవర్గ కేంద్రం నుంచి ఉన్నారు. సీనియర్ నటుడు సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ, నటి ఊర్వశి శారద కూడా రాజకీయంగా గెలిచారు. శారద గతంలో తెనాలి పార్లమెంటు ఉన్న సమయంలో ఎంపీగా గెలిచారు. కృష్ణ,కొంగర జగ్గయ్యలు కూడా గతంలో గెలుపొందారు.

నియోజకవర్గ ముఖచిత్రం





● ఆలపాటి వెంకటరామయ్య




● దొడ్డపనేని ఇందిర



● అన్నాబత్తుని సత్యన్నారాయణ



● నాదెండ్ల భాస్కరరావు



● నాదెండ్ల మనోహర్



● ఆలపాటి రాజా



● రావి రవీంద్రనాథ్



● అన్నాబత్తుని శివకుమార్



● గోగినేని ఉమ



● కొణిజేటి రోశయ్య

ఉద్దండుల జయాపజయాలు...

తెనాలి ఎందరో ఉద్దండులకు రాజకీయ వేదికగా నిలిచింది. కొణిజేటి రోశయ్య న్యాయవాద వృత్తి చేపట్టి తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆర్థికవేత్తగా మంచిపేరున్న ఆయన కాంగ్రెస్ మంత్రివర్గాలలో అనేకమంది ముఖ్యమంత్రుల కొలువులో ఆర్థిక మంత్రిగా పదవులను అలంకరించారు. తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా చేశారు. ఆ తర్వాత తమిళనాడు గవర్నర్‌గా పనిచేశారు. అయితే ఈయన ఎక్కువగా వేమూరు నుంచి పోటీలో నిలిస్తే, తెనాలిలో పోటీచేసిన ఒక్కసారి ఓటమి పాలయ్యారు. 1999లో పోటీచేసి గోగినేని ఉమ చేతిలో ఓటమి చెందారు. నాదెండ్ల భాస్కరరావు ఎన్టీఆర్ అనుచరునిగా, ఆ తర్వాత ఆయన ప్రభుత్వం కూల్చివేత అనంతరం ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే ఆయన అతి తక్కువ కాలమే ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన కుమారుడు నాదెండ్ల మనోహర్ రాష్ట్ర విభజన సమయంలో స్పీకర్‌గా, నేడు జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. ప్రస్తుతం తెనాలి స్థానం నుంచి ఉమ్మడి అభ్యర్థిగా పోటీలో ఉన్నారు.

తెనాలి పార్లమెంట్‌లోనూ ఎందరో ప్రముఖులు

1952లో ఏర్పడిన తెనాలి పార్లమెంటు స్థానంలో ఎందరో ప్రముఖులు పోటీచేసి విజయాలు సాధించారు. అయితే 2004 ఎన్నికల తర్వాత ఈ పార్లమెంట్ స్థానం లేకుండాపోయింది. అప్పటి వరకు జరిగిన 14 ఎన్నికల్లో తొలి ఎంపీగా కొత్త రఘురామయ్య ఎన్నికయితే, తర్వాత ఎన్జీ రంగా, కమ్యూనిస్టు ప్రముఖులు కొల్లా వెంకయ్య, లావు బాలగంగాధర రావు ఇక్కడి నుంచి పోటీచేసి గెలిచారు. తర్వాత సినీనటి ఊర్వశి శారద, కేంద్రమంత్రులుగా చేసిన పి.శివశంకర్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కూడా ఇక్కడ గెలిచి ఢిల్లీ పీఠంపై పదవులను దక్కించుకున్నారు. అయితే 2004లో జరిగిన ఎన్నికలే చివరివి అయితే, 2009 నాటికి తెనాలి పార్లమెంటు రద్దయి, గుంటూరు పార్లమెంటులో తెనాలి అసెంబ్లీ నియోజక వర్గాన్ని కలిపేశారు. దీంతో అప్పటి నుంచి తెనాలి కేవలం అసెంబ్లీ ఎన్నికలకే పరిమితమైంది.

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు

- కమ్మ : 31,000
- కాపు : 40,000
- వైశ్య : 21,000
- మాల : 30,000
- మాదిగ : 26,000
- బ్రాహ్మణ : 6,000
- రెడ్డి : 12,000
- ముస్లిం : 25,000
- యాదవ : 20,000
- పద్మశాలి : 10,000
- రాజులు : 2,000
- రజక : 8,000
- విశ్వబ్రాహ్మణ : 5,000
- గౌడ : 9,000
- నాయీబ్రాహ్మణ: 4,000
- మేదర : 1,500
- కుమ్మర : 1,500
- కుంకుపు : 500
- ముదిరాజులు: 1000
- లంబాడీ : 5,000
- ఎరుకల : 2,500
- యానాది : 2,500
- మార్వాడీ : 1,900

ప్రస్తుత ఎన్నికల్లో..

ప్రస్తుత ఎన్నికలకు అంతా సమాయత్తమయితే, అధికార వైసీపీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మరోసారి పోటీలో ఉండగా, గత ఎన్నికల్లో వేరువేరుగా పోటీచేసిన తెలుగుదేశం, జనసేన ఇప్పుడు బీజేపీతో కలసి పోటీలో నిలవటం, వీరి ఉమ్మడి అభ్యర్థిగా జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ పోటీ పడుతుండటం ఇక్కడ ప్రత్యేకం. గత ఎన్నికల్లో విజయం సాధించిన వైసీపీ అభ్యర్థి శివకుమార్‌కు 94,495 ఓట్లు వస్తే, టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు 76,846 ఓట్లు దక్కాయి. అయితే ఇక్కడ త్రిముఖ పోటీలో నాదెండ్ల మనోహర్ అనూహ్యంగా 29,905 ఓట్లు పొందారు. దీంతో శివకుమార్‌కు విజయం దక్కింది. అయితే ఇప్పుడు ఇద్దరు కాకుండా మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా ఒక్కరే రంగంలోకి దిగటంతో చీలిన ఓట్లు ఆయనకు బలం చేకూర్చుతాయని, విజయాన్ని తెచ్చిపెడతాయనే ఆశాభావాన్ని ఆయా పార్టీలు వ్యక్తం చేస్తున్నాయి. అయితే పోటీ ఈసారి రసవత్తరంగా మారటం తెనాలి గడ్డపై ఉత్కంఠకు తెరలేపినట్టయింది.

రాజకీయ కళావేదిక తెనాలి

స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఉవ్వెత్తున ఎగసిపడిన ఉద్యమ జ్వాలలు నేటికీ ఈ పోరాటాల గడ్డపై రాజకీయ చైతన్యం రూపంలో ఇంకా ఎగసిపడుతూనే ఉన్నాయి... ఎందరో అమర వీరుల త్యాగాలకు ప్రతిరూపంగా నిలిచిన తెనాలి కేవలం ఉద్యమాలకే కాకుండా, కళలకు నిలయంగా, ఎందరో కళాకారులను అందించింది. నిత్యం పచ్చని పైరులతో పచ్చచీర కట్టుకున్నట్టు కనిపించే తెనాలికి పట్టణం మధ్య నుంచి వెళ్లే మూడు కాల్వలు ప్యారిస్ పేరునూ తెచ్చిపెట్టి, ఆంధ్రా ప్యారిస్‌గా ఖ్యాతి పొందింది. ఈ మూడు కాల్వలు ప్రవహించటం వల్లే అప్పట్లో హిందీలో 'తీన్ నాల్' అని పిలిచేవారని, తీన్ అంటే మూడు, నాల్ అంటే కాల్వలు అనే అర్ధం కావటంతో ఈ పదం కాలక్రమంలో తెనాలిగా మారిందనేది కూడా ఒక నానుడి.

- స్వాతంత్ర్యోద్యమాల నేల.. ఎందరో ఉద్దండులు ఏలిన నేల
- పోరాటాల పురిటిగడ్డపై ఎందరో ఉద్దండులు పోటీ
- వారసులకే ఇక్కడి ప్రజలు పట్టం
- తెనాలి రూటే సపరేటు.. ఇక్కడ ఎవరు గెలిస్తే ఆ పార్టీదే అధికారం
- 1985 నుంచి ఇదే ఆనవాయితీ
- రెండే మండలాలు... భారీగానే ఓటర్లు
- పార్లమెంట్ పోయి అసెంబ్లీ మిగిలె...

తెనాలి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణం పురపాలక సంఘంగా 1909లోనే ఏర్పడింది. క్రమక్రమంగా అభివృద్ధి చెందుతూ ప్యారిస్ అందాలను కూడా సొంతం చేసుకుంది. ఎంతో చారిత్రక ప్రాధాన్యం కలిగిన తెనాలి నుంచి ఎందరో స్వాతంత్ర సమరయోధులు, సినీ, నాటక రంగ ప్రముఖులు, రాజకీయ ఉద్దండులు పుట్టుకొచ్చారు. తెనాలి అసెంబ్లీ నియోజకవర్గం 1952లో ఏర్పడితే, పార్లమెంటరీ నియోజకవర్గం కూడా 1952లోనే ఏర్పాటయింది. అయితే 2004లో చివరి పార్లమెంటు ఎన్నికలు జరిగితే, 2009 నుంచి తెనాలి పార్లమెంటు స్థానాన్ని తీసేసి, దానిని గుంటూరు పార్లమెంటులో కలిపేశారు. తెనాలి పార్లమెంటు కింద 14సార్లు ఎన్నికలు జరిగితే, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడ్డాక 15 సార్లు ఎన్నికలు జరిగాయి. 2024లో 16వ సారి ఎన్నికల జరగనున్నాయి. తెనాలి నియోజక వర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీ రాష్ట్రం లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే నానుడి ఉంది. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి ఇది నిజమవుతూనే వచ్చింది. ఇక్కడ గెలిచిన అభ్యర్థులు ఆయా మంత్రివర్గాల్లో అత్యున్నత పదవులు అలంకరించిన సందర్భాలూ ఉన్నా యి. అటువంటి వారిలో నాదెండ్ల భాస్కరరావు, అన్నాబత్తుని సత్యన్నారాయణ, నాదెండ్ల మనోహర్ వంటివారున్నారు. అయితే ఆలపాటి వెంకటరామయ్య కుటుంబానికి ఎక్కువ సార్లు ఎమ్మెల్యే అయ్యే అవకాశం కలిగింది.



తెనాలి మున్సిపల్ భవనం

వారసత్వానికి పట్టం... ఏడుసార్లు ఏలిన ఒకే కుటుంబం

నియోజకవర్గం ఏర్పడ్డ తర్వాత ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరిగితే తొలి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆలపాటి వెంకట్రామయ్య కుటుంబం ఆరుసార్లు గద్దె నెక్కింది. ఆయన వరుసగా మూడు సార్లు గెలిస్తే, ఆయన కుమార్తె దొడ్డపనేని ఇందిర హ్యాట్రిక్ విజయాలను సాధించారు. ఒకసారి కాంగ్రెస్, మరోసారి స్వతంత్ర, మూడోసారి జనతాపార్టీ తరఫున ఆమె గెలిచారు. వీరి తర్వా త ఇందిర కుమార్తె డాక్టర్ గోగినేని ఉమ 1999లో గెలిచారు. ఇది ఒక రికార్డయితే ఇక్కడ వీరి బాటలోనే వా రసులకు అవకాశాలు దక్కాయి. టీడీపీ ఆవిర్భవించాక ఆ పార్టీ తరఫున అన్నాబత్తుని సత్యన్నారాయణ 1983, 1985 ఎన్నికల్లో వరుసగా రెండు సార్లు గెలుపొందితే, ఆయన కుమారుడు శివకుమార్ గత 2019 ఎన్నికల్లో విజయం సాధించారు. మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు 1989లో ఇక్కడ పోటీచేసి గెలుపొందితే, ఆయన కుమారుడు నాదెండ్ల మనోహర్ 2004, 2009 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించారు. ఈయన అసెంబ్లీ స్పీకర్‌గా కూడా పని చేశారు.

నియోజకవర్గ ఓటర్లు 2,65,863

పురుషులు : 1,28,188

స్త్రీలు : 1,37,642

ఇతరులు: 33

సంవత్సరం	విజేత	పార్టీ	ఓటమి	పార్టీ	మెజార్టీ
1952	ఆలపాటి వెంకట్రామయ్య	కాంగ్రెస్	రావి అమ్మయ్య	సీపీఐ	8,077
1955	ఆలపాటి వెంకట్రామయ్య	కాంగ్రెస్	రావి అమ్మయ్య	సీపీఐ	8,295
1962	ఆలపాటి వెంకట్రామయ్య	కాంగ్రెస్	రావి అమ్మయ్య	సీపీఐ	6,198
1967	దొడ్డపనేని ఇందిర	కాంగ్రెస్	చింతమనేని సుబ్బారావు	స్వతంత్ర	32,335
1972	దొడ్డపనేని ఇందిర	స్వతంత్ర	నన్నపనేని వెంకట్రావు	కాంగ్రెస్	5753
1978	దొడ్డపనేని ఇందిర	జనతా	నన్నపనేని వెంకట్రావు	కాంగ్రెస్(ఐ)	2010
1983	అన్నాబత్తుని సత్యన్నారాయణ	స్వతంత్ర	దొడ్డపనేని ఇందిర	కాంగ్రెస్	29,224
1985	అన్నాబత్తుని సత్యన్నారాయణ	టీడీపీ	దొడ్డపనేని ఇందిర	కాంగ్రెస్	4589
1989	నాదెండ్ల భాస్కరరావు	కాంగ్రెస్	అన్నాబత్తుని సత్యన్నారాయణ	టీడీపీ	18,573
1994	రావి రవీంద్రనాథ్	టీడీపీ	నాదెండ్ల భాస్కరరావు	కాంగ్రెస్	13,531
1999	గోగినేని ఉమ	టీడీపీ	కొణిజేటి రోశయ్య	కాంగ్రెస్	5394
2004	నాదెండ్ల మనోహర్	కాంగ్రెస్	గోగినేని ఉమ	టీడీపీ	12,745
2009	నాదెండ్ల మనోహర్	కాంగ్రెస్	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	2884
2014	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	అన్నాబత్తుని శివకుమార్	వైసీపీ	19,065
2019	అన్నాబత్తుని శివకుమార్	వైసీపీ	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	17,649

రాక్షస పాలనకు.. చరమగీతం

- వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
- ప్రజాగళం సభను జయప్రదం చేయండి

బాపట్ల, మార్చి29: రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని బాపట్ల పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. బాపట్ల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం చంద్రబాబునాయుడు పర్యటన గురించి కూటమినాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అధ్యక్షత వహించగా ఏలూరి సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గతంలో బాదుడే బాదుడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించేందుకు బాపట్లలో రోడ్ షో నిర్వహించారన్నారు. ఆ తర్వాత మిచౌంగ్‌తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఓదార్చటానికి బాపట్ల జిల్లాలో పర్యటించారన్నారు. మూడోవసారి ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించేందుకు ఈనెల 31వ తేదీన బాపట్ల వస్తున్నారని తెలిపారు. ఈ పర్యటన అత్యంత కీలకమైనదన్నారు. ఉమ్మడి ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టే కార్యక్రమాలు గురించి ప్రజలకు వివరిస్తారన్నారు. కావున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కలిసికట్టుగా ప్రజలకు వివరించి కార్యక్రమానికి తీసుకురావాలన్నారు. తద్వారా వేగేశన నరేంద్రవర్మ గెలుపుకు సంకేతం ఇవ్వాలన్నారు. నష్టపోయిన రైతులు ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ప్రజాపాలనకు కూటమి ఏర్పడింది: వేగేశన

రాక్షసులను అంతమొందించటానికి దేవగణాలన్నీ ఒక్కటైనట్లు వైసీపీని గద్దెదించి ప్రజాపాలనందించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడిందని ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. ఉద్యోగ, వ్యవసాయ, కార్మిక, ధార్మిక, కర్షక, వ్యాపార రంగాలన్నీ ఐదేళ్ల వైసీపీ పాలనలో అతలాకుతలమయ్యాయని దుయ్యబట్టారు. గతంలో ఏ ముఖ్యమంత్రికి లేని చరిత్ర జగన్‌కు ఉందన్నారు. ఇలాంటి హీనమైన చరిత్ర ఎలాంటి అక్షరాలలో రాయాలని ప్రశ్నించారు? కుల,మతాలకు అతీతంగా ప్రజలు ఈ ముఖ్యమంత్రి మాకు వద్దు అని చర్చిలు, మసీదులు, దేవాలయాల్లో ప్రార్థనలు చేస్తున్నారన్నారు. బాపట్ల ఎంపీగా తెన్నేటి కృష్ణప్రసాద్ పోటీ చేయటం ఈ ప్రాంతం చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఎంపీ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశంతోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమన్నారు. ఉద్యోగ, ఉపాధి రంగాల ద్వారా యువతకు మంచి భవిష్యత్తు కల్పించాలంటే కూటమి అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, ఉమ్మడి జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి, బీజేపీ యువమోర్చా రాష్ట్ర కోశాధికారి బి.కృష్ణచైతన్య, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ రావిపూడి నాగమల్లేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, కర్లపాలెం జడ్పీటీసీ మెంబరు పిట్టల వేణుగోపాల రెడ్డి, నాయకులు రామకృష్ణ, తోట నారాయణరావు, విన్నకోట వీరయ్యనాయుడు, వై.భూపతి రావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేగేశన నరేంద్రవర్మ, వేదికపై ఏలూరి సాంబశివరావు, కృష్ణప్రసాద్

రేపు టీడీపీ అధినేత చంద్రబాబు బాపట్ల రాక

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 31వ తేదీ బాపట్లలో రోడ్డుషో నిర్వహించనున్నారు. సాయంత్రం 5.35 నిమిషాలకు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో హెలీప్యాడ్‌లో దిగి అక్కడ నుంచి రోడ్డు మార్గాన అంబేద్కర్ సర్కిల్ చేరుకొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. తిరిగి 7.45కు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలకు రోడ్డు మార్గాన వెళ్ళి అక్కడ బస చేయనున్నట్లు పార్టీ శ్రేణులు తెలిపారు. కావున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ఉందామా.. సర్దుకుందామా..!

- పర్చూరు వైసీపీ శ్రేణుల్లో అంతర్మథనం
- బాలినేని, ఆమంచి వర్గీయుల ఆధిపత్య పోరు
- నలిగిపోతున్న అభ్యర్థి యడం బాలాజీ



చీరాల, మార్చి29: వైసీపీ పర్చూరు నియోజకవర్గ నాయకుల్లో అంతర్మథనం పతాకస్థాయికి చేరుకుంది. బాలినేని, ఆమంచి వర్గీయులు మధ్య ఆధిపత్య పోరు అందుకు కారణంగా చెప్తున్నారు. ఈ క్రమంలో పార్టీలో ఉందామా, సర్దుకుందామా అనే ధోరణిలో పలువురు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఆపార్టీ అభ్యర్థి యడం బాలాజీ తాను ఎంచుకున్న మార్గంలో రాజీలేకుండా అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలో బాలాజీ నలిగిపోతున్నారు. వైసీపీ పర్చూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా తొలుత ఉన్న రావి రామనాథంబాబు స్థానంలో కొత్త ఇన్‌చార్జ్‌ని నియమించాలనే అధిష్ఠానం ఆలోచనలో భాగంగా పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. అంతిమంగా చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే, ఆమంచి పేరును మొదటి నుంచి మాజీమంత్రి బాలినేని వ్యతిరేకిస్తూ వచ్చారు. ఈక్రమంలో ఆమంచి బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి ఆ నియోజకవర్గ వైసీపీలో వర్గపోరు మొదలయింది. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వర్గీయులుగా చెలామణి అవుతున్న వారిలో సింహభాగం ఆమంచి రాకను వ్యతిరేకించారు. ఆమంచి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత కూడా బాలినేని వర్గీయులు ఆలోచన మారలేదు. ఇదిలా ఉంటే ఎంపీ నందిగం సురేష్ వర్గీయులకు, ఆమంచి వర్గీయులకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గు మన్న చందంగా పరిస్థితి నెలకొంది. దీంతో శత్రువుకు, శత్రువు మిత్రుడు అన్న చందంగా మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ నందిగం సురేష్ వర్గీయులు ఒకటిగా అడుగులు వేసేందుకు కార్యాచరణ రూపొందించుకుని అడుగులు వేస్తున్నట్లు ఆ పార్టీ వర్గీయులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఆ తరువాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి ఆమంచిని అధిష్ఠానం తప్పించింది. ఆ స్థానంలో చీరాలకు చెందిన యడం బాలాజీని ఇన్‌చార్జ్‌గా నియమించటం, ఆతరువాత వైసీపీ అభ్యర్థిగా ప్రకటించటం వెంట వెంటనే జరిగాయి. ఈ క్రమంలో బాలాజీకి బాలినేని వర్గం, ఆమంచి వర్గంను సమన్వయపర్చుకోవడం కత్తిమీద సాములా మారింది. ఈనేపథ్యంలో తిమిడిదపాడు వ్యవహారం చినికి చినికి గాలివాన అయిందని శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. అందులో భాగంగా కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, బాలాజీల మధ్య జరిగిన వాగ్వాదం ప్రస్తుతం నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. ఆప్రభావం పార్టీ మీద ఎంత ఉందనేది ఒకపక్క చర్చ జరుగుతుంటే, అదే అంశం టీడీపీకి ఏ మేరకు లాభిస్తుందనే కోణంలో రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. ఎన్ని కూడికలు, తీసివేతలు వేసినా జరుగుతున్న పరిణామాలు అంతిమంగా టీడీపీకి లాభిస్తాయనే వాదన నియోజకవర్గంలో బలంగా వినిపిస్తోంది.



గుంటూరులో గుడ్‌ఫ్రైడే ప్రార్థనల్లో పాల్గొన్న బిషప్ భాగ్యయ్య

భక్తిశ్రద్ధలతో.. శుభశుక్రవారం

బాపట్ల, మార్చి 29: సర్వమానవాళి పాపపరిహారం నిమిత్తం కల్వరి సిలువలో ప్రాణత్యాగం చేసిన ఏసుక్రీస్తు త్యాగాలను స్మరించుకుంటూ గుడ్ ఫ్రైడే ప్రార్థనలను క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మానవాళి పట్ల ప్రేమ, దయ చూపించాలని చెప్పిన క్రీస్తు సిలువపై పలికిన 7మాటల విశిష్టత గురించి సంఘకాపరులు, సంఘస్తులు వివరించారు. నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలోని సాల్వేషన్ ఆర్మీ, ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్‌చర్చిలు, వివిధ సంఘాల్లో ప్రార్థనలు పెద్దఎత్తున జరిగాయి. బాపట్ల పట్టణంలోని సీబీజెడ్ చర్చిలో నిర్వహించిన ప్రార్థనలో క్రైస్తవ సోదరులు పెద్దఎత్తున హాజరయ్యారు.



బాపట్ల సీబీజెడ్ చర్చిలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలకు హాజరైన సంఘస్తులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(శనివారం)

సహారీ (ఉదయం) 4.47 (ఆదివారం)

అమరావతిని అభివృద్ధి చేసి చరిత్రలో నిలవాలి

● 1564వ రోజుకు చేరుకున్న ఆందోళనలు



బిల్డ్ అమరావతి అంటూ తుళ్లూరులో ఇళ్ల వద్ద నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్ళూరు, మార్చి 29: అధికారం ఉంది కదా అని అమరావతిని నిర్వీర్యం చేసి సీఎం జగన్‌రెడ్డి అడ్డగోలుగా వ్యవహరించారని, రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1564వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వెంకటపాలెం రైతుల ధర్నా శిబిరం, రాజధాని గ్రామాల్లో ఇళ్ల వద్ద నుంచి నిరసన దీక్షలు, ఆందోళనలు చేస్తున్న పలువురు రైతులు, మహిళలు మాట్లాడారు. పదవులు ఎప్పుడూ అధికారం శాశ్వతంగా కాదన్నారు. సీఎం జగన్‌రెడ్డి ప్రజావేదిక కూల్చివేసి, పోలవరం, అమరావతి నిర్వీర్యం చేసి చరిత్ర హీనుడని ప్రజలు చెప్పుకునే విధంగా ఈ ఐదేళ్ల పరిపాలన చేశాడన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చెప్పిన తీర్పును లెక్క చేయకుండా కాలక్షేపం చేసేవారిని ఎన్నికల్లో అడ్రస్ లేకుండా చేయాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో రైతుల నిరసన దీక్షలు, ఆందోళన కొనసాగాయి.

తెలుగువాడి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్

● మాజీ మంత్రి ఆనందబాబు



ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించిన అనంతరం ప్రసంగిస్తున్న మాజీమంత్రి ఆనందబాబు

వేమూరు, మార్చి 29: ఎన్టీఆర్ స్ఫూర్తితో రాష్ట్రాన్ని పునరుజ్జీవింప చేసుకునే అవసరం ఎంతైనా ఉందని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన వేమూరులోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన ఆనందబాబు ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రతీక ఎన్టీఆర్ అన్నారు. నాడు ఆయన ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ఈనాడు దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు అమలులోకి తెచ్చాయన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, బీసీ సంఘ నేత తులం రమేష్‌బాబు, పల్లా వాసుదేవరాయుడు, చావలి సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు, తెలుగు రైతు నాయకులు బండారు సూరిబాబు, వేమూరి మురళీకృష్ణ, మన్నే పసి, గోపినాథ్, రాజేష్, కొండ్రుబుల్లియ్య, అనే ప్రసాద్, యలవర్తి సురేంద్ర, కోగంటి శ్రీనుబాబు, శివకృష్ణ, వేల్పుల రవి, ఉక్కుర్తినాగయ్య, దాది లక్ష్మణరావు, గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో

వైసీపీకి బిగ్ షాక్

● మల్లెల రాజేష్ నాయుడు సహా..

● 25 మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన రాజేష్ నాయుడు తదితరులతో నారా లోకేశ్, పుల్లారావు

చిలకలూరిపేట, మార్చి 29: చిలకలూరిపేటలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. చిలకలూరిపేట వైసీపీ అభ్యర్థిగా తొలుత ప్రకటించబడి అవమానానికి గురైన మల్లెల రాజేష్ నాయుడు, కొలిశెట్టి శ్రీనివాసరావు, 10 మంది మునిసిపల్ కౌన్సిలర్లు, ఒక జడ్‌పీటీసీ సహా మొత్తం 25 మంది వైసీపీ ముఖ్యులు ఆ పార్టీని వీడి తెలుగుదేశంలో చేరారు. హైదరాబాదులో శుక్రవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, మాజీ మంత్రి, చిలకలూరిపేట టీడీపీ అభ్యర్థి పత్తిపాటి పుల్లారావు సమక్షంలో వీరంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. లోకేష్ వీరందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు.

ప్రస్తుతం ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ఉండి, మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి విడదల రజినిపైనా కొద్ది రోజుల క్రితమే రాజేష్ నాయుడు సంచలన ఆరోపణలు చేశారు. రజిని నిష్క్రమణ అనంతరం ఇప్పటి వరకు వైసీపీ సమన్వయకర్తగా కూడా ఉన్న ఆయన మంత్రి రజిని రు.6.5 కోట్లు డబ్బు తీసుకుని మోసం చేశారని వెల్లడించారు. అదే విషయంపై ప్రభుత్వ సలహాదారు సజ్జల వద్ద పంచాయతీ కూడా జరిగిందని బాంబు పేల్చారు. అనంతరం పరిణామాల్లోనే ఆకస్మికంగా చిలకలూరిపేట అభ్యర్థిని మార్చిన సీఎం జగన్.. రాజేష్ నాయుడు స్థానంలో కావటి మనోహర్ నాయుడుకు బాధ్యతలు ఇచ్చారు.

అన్యాయాలను భరించలేకనే పార్టీని వీడాం : మల్లెల

ఈ సందర్భంగా రాజేష్ నాయుడు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైసీపీ విజయానికి తనతో పాటు ఎంతోమంది నాయకులు దోహదపడ్డారన్నారు. కొంతకాలంగా అక్కడ జరుగుతున్న విపరీత పరిణామాలు, ఆ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలపై విసుగు చెంది, తమకు జరిగిన తీవ్ర అన్యాయాన్ని భరించలేకే వైసీపీని వీడాల్సివచ్చిందన్నారు. ఐదేళ్లుగా చిలకలూరిపేటలో మంత్రి విడదల రజిని భూదందాలు మొదలు నిరుపేదలు, చిన్న చిన్న వ్యక్తుల పొట్టకొట్టడం కూడా జరిగిందన్నారు. ఆ తర్వాతే చిలకలూరిపేటలో గెలవడం అసాధ్యం, ఇక ఎందుకు పనికిరానని తెలుసుకొని గుంటూరు పశ్చిమలో సీటు సాధించుకున్నారన్నారు. స్థానిక వ్యక్తికే సీటు కేటాయించాలని ఎన్నోసార్లు కోరినా పట్టించుకోలేదన్నారు. అందుకే మన చిలకలూరిపేటను మనమే బాగుచేసుకోవాలనే ఉద్దేశంతో టీడీపీని, ప్రత్తిపాటి పుల్లారావును బలపరచాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరికలు

టీడీపీలో చేరినవారిలో యడ్లపాడు మండల జడ్పీటీసీ సభ్యులు ముక్తా వాసు, చిలకలూరిపేట మునిసిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, మునిసిపల్ కౌన్సిలర్లు తులం సుధాకర్, చెమిటిగంటి పార్వతిదేవి, బిట్రా రాజేంద్రప్రసాద్, షేక్ జమీలా, జాలాది సుబ్బారావు, కౌన్సిలర్, వైసీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేరింగ్ మౌలాలి, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు పంగులూరి వెంగళరాయుడు, గణపవరం కు చెందిన బెల్లంపల్లి అచ్చయ్య, కాట్రు శ్రీనివాసరావు, కట్టుబడి వారి పాలెంకు చెందిన మాజీ సర్పంచ్ తిమ్మిశెట్టి కోటేశ్వరరావు, వైసీపీ సీనియర్ నాయకులు గాలి బుచ్చయ్య, బీసీసెల్ పట్టణ అధ్యక్షుడు, వైసీపీ ముఖ్య నాయకుడు ఎం.వి.రత్నారెడ్డి, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు యాదాల సుజాత, బుక్కాపురం సర్పంచ్ అల్లం ఆంజనేయులు, విద్యార్థి విభాగం నాయకులు నాగూర్, ఇక్బాల్, గౌస్‌లు, సీనియర్ నాయకులు రామిశెట్టి తాండవేశ్వరరావు, తోట సీతయ్య, కోట నాగపూర్ణచంద్రరావు, గుంజి బాజిలతోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

ఎన్నికల అధికారిపై వైసీపీ నిఘా: ధూళిపాళ్ళ

● సాక్షి భవనారాయణ స్వామి ఆలయం భూముల అన్యాక్రాంతానికి జీవో



సమావేశంలో మాట్లాడుతున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, మార్చి29: ఎన్నికల అధికారిపై వైసీపీ నాయకత్వం సొంత పత్రిక విలేకరిని నిఘా పెట్టి బెదిరింపులు ప్రలోభాలకు గురిచేయాలని చూస్తున్నారన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపించారు. శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు ఫోన్ సంభాషణే ఇందుకు ఆధారం అని స్పష్టం చేశారు. సదరు నాయకుడు వైసీపీ సొంత పత్రిక విలేకరికి ఫోన్ చేసి ఎన్నికల అధికారి ఎవరెవ్వరిని కలుస్తున్నారో, ఎక్కడి వెళ్లుతున్నారు, ఏం చేస్తున్నారు మొత్తం వివరాలు నిఘా పెట్టాలని ఆ ఫోన్ సంభాషణలో కోరినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన ఆడియో సరైన సమయంలో విడుదల చేస్తామన్నారు. సంబంధం లేని విషయంలో తమను ఇరికించాలనే ప్రయత్నాలను మానుకోవాలని నరేంద్ర స్పష్టం చేశారు. ఎన్నికల అధికారులను వైసీపీ పెద్దలు భయపెట్టి, ప్రలోభపెట్టి తమకు అనుకూలంగా వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపిన సైకిల్ వ్యవహారంలో ప్రభుత్వమే సిగ్గు పడాలిసిన అవసరం ఉందన్నారు. పేద బాలికలు బడికి వెళ్లటానికి 2019 ముందు ప్రభుత్వం ఉచితంగా సైకిళ్లను అందచేసిందన్నారు. ఆ సైకిళ్లను కూడా ఎన్నికల కేసు సాకు చూపి వదిలివేశారన్నారు, అయితే కోర్టు ఆదేశాల ప్రకారం ప్రభుత్వ ఆస్థిని వేలం వేయగా ఓ ప్రైవేటు వ్యక్తి వాటిని వేలంలో పాడుకున్నారన్నారు. ఆ సైక్కిళ్లు పంపిణీ చేస్తున్నారని తప్పుడు ఫిర్యాదు అందచేసిన వ్యక్తి ఎవరో బహిరంగ పరిచే ధైర్యం అధికారులకు ఉందా అని ప్రశ్నించారు.

భవనారాయణ స్వామి భూముల కబ్జాకు యత్నం..

సాక్షి భవనారాయణ స్వామి ఆలయానికి చెందిన విలువైన భూములు కబ్జా చేయటానికి వైసీపీ నాయకుల ప్రయత్నాలు కొనసాగుతున్నాయని నరేంద్ర ధ్వజమెత్తారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావటానికి సరిగా మూడు రోజుల ముందు 16 ఎకరాల భవనారాయణ స్వామి భూమిని లాంగ్ లీజ్‌కు ఇవ్వాలని దేవాదాయ శాఖ ఉత్తర్వులు ఇవ్వటం అనుమానాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కన్ను ఈ భూములపై పడిందని ఆరోపించారు. ఈ భూములపై కన్ను ఉన్నందునే రోశయ్య తన సతీమణిని పాలకవర్గ సభ్యురాలుగా చేర్చారని ఆరోపించారు. ఈ విషయంపై తాము గతంలో పోరాడితే ఆటోనగర్‌కు అడ్డంకులు సృష్టిస్తున్నారని తమపై దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. 22ఎ చట్టం క్రింద భూములు నమోదై సామాన్యులు పడుతున్న ఇబ్బందులు ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. అనమర్లపూడి గ్రామంలో దళితులకు సంబంధించిన 23 ఎకరాల భూములను కూడా ఇలాగే ఉత్తర్వులు తెచ్చుకొని హస్తగతం చేసుకున్నారని ఆరోపించారు. వీటన్నిటిపై సమగ్ర విచారణ కోరనున్నట్లు నరేంద్ర కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదాం

● గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని పిలుపు



దాచేపల్లిలో బీజేపీ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని

దాచేపల్లి, మార్చి 29: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడమే లక్ష్యంగా పనిచేయాలని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం నారాయణపురంలోని నాగిరెడ్డి కల్యాణ మండపంలో బీజేపీ గురజాల నియోజకవర్గ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన యరపతినేని మాట్లాడుతూ కేంద్ర పథకాలన్నీ రాష్ట్రప్రభుత్వ పథకాలుగా చెప్పుకుంటూ రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోందన్నారు. గత 40 ఏళ్లలో ఏ ప్రభుత్వం చేయనటువంటి దుర్మార్గాలు, హత్యలు, దోపిడీలు, మైనింగ్ మాఫియా ఈ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో జరిగిందన్నారు. రానున్న టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా అందరం కలిసి పనిచేద్దామని యరపతినేని పిలుపునిచ్చారు. బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఆలోకం సుధాకర్‌బాబు, కొక్కెర శ్రీనివాసయాదవ్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధుల తో చేసిన అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం తమ పార్టీ రంగులు వేసి జగన్ బొమ్మలు వేశారని విమర్శించారు. ఆఖరుకు పేద ప్రజలకు అందిస్తున్న ఉచిత బియ్యం కూడా ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం అందిస్తున్నవేనని తెలిపారు రానున్న ఎన్నికలలో ఎన్‌డీఏ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావును భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బిజెపి నాయకులు కేతనబోయిన హనుమంతరావు, పునుగుల రవిశంకర్, మువ్వల వెంకట మనోజ్, ఆరె వెంకటేశ్వర్లు, మల్లెమారపు నాగేశ్వరరావు, బొడ్డు పెదనరసింహారావు, కొఠారి సురేష్, సైదారావు, కేశానుపల్లి నరసింహారావు, స్వర్ణ సుబ్బారావు, గురజాల, మాచవరం మండలాల బిజెపి అధ్యక్షులు, టీడీపీ నాయకులు బెల్లంకొండ భద్రి, తంగెళ్ల శ్రీనివాసరావు, డాక్టర్ కర్నాటి వరలక్ష్మి, జనసేన నేతలు మందపాటి దుర్గారావు, బడిదల శ్రీనివాసరావు, అంబటి మల్లి తదితరులు పాల్గొన్నారు.

గడువు దాటాక ఫాం.. 8 దాఖలు

● ఆర్వో లాగిన్‌లో నిలిచిన జాబితా

● వైసీపీ అభ్యర్థి అనుచరులు దాఖలు చేసినట్లు ప్రచారం

వేమూరు, మార్చి 29: ఇతర నియోజకవర్గాలకు చెందిన కొందరు ఓటర్లు వేమూరు నియోజకవర్గానికి తమ ఓటును బదిలీ కోరుతూ ఫామ్ 8 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దాఖలు చేసినట్లు తెలుస్తోంది. సంబంధిత వ్యక్తులు వైసీపీ అభ్యర్థి అనుచరులుగా ప్రచారంలో ఉంది. ఈనెల 16వ తేదీలోగా క్లెయిమ్స్ దాఖలు చేసుకునే అవకాశం ఉంది. ఆ తదుపరి దాఖలు చేసిన వాటిని పరిశీలించే అవకాశం లేకుండా ప్రత్యేక లాగిన్‌లో నిలిచిపోయాయి. అయినప్పటికీ అధికార పార్టీకి చెందిన వ్యక్తులు ఎలాగైనా దాఖలు చేసిన ఫామ్ 8లకు అనుమతి పొందేలా ప్రయత్నిస్తున్నట్టుగా తెలుస్తోంది. 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 25 వరకు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధి 89గ్రామాల ద్వారా వివిధ రకాల పరిష్కారాలు కోరుతూ 12,652 మంది ఓటర్లు దరఖాస్తు చేశారు. వాటిలో 126 దరఖాస్తులను బీఎల్‌ఓల పరిశీలనకు పంపారు. బీఎల్‌వోలు 17 దరఖాస్తులను ప్రత్యేక పరిశీలనకు అధికారులకు పంపారు. 91దరఖాస్తులను ఈఆర్వోకు దాఖలు చేశారు. 1429 దరఖాస్తులను తిరస్కరించారు. కాగా చివరికి 10,989 దరఖాస్తులను అనుమతించారు. 234 దరఖాస్తులు మాత్రం పెండింగ్లో ఉన్నాయి. ఇదిలా ఉండగా ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఫామ్ 8ల దరఖాస్తుకు ఈనెల 16తో గడువు పూర్తయినప్పటికీ గడువు ముగిశాక కొందరు వ్యక్తులు ఇతర నియోజకవర్గాల నుంచి వేమూరు నియోజకవర్గానికి ఓటు హక్కును మార్చుకునేందుకు దరఖాస్తు చేశారు. 200లకు పైగానే అలాంటి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరిచినట్లు సమాచారం. దీనిపై ఈఆర్‌ఓను వివరణ కోరగా గడువు ముగిశాక దాఖలు చేసి దరఖాస్తులను ఎలాంటి పరిస్థితుల్లోనూ పరిశీలించే అవకాశం లేదన్నారు. అలాంటివన్నీ కూడా ఆర్వో లాగిన్‌లో నిలిచిపోయి ఉంటాయని వివరించారు. ఎలాంటి ఒత్తిళ్ళకు లొంగకుండా ఎన్నికల కమీషన్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తామని తెలిపారు.

వలంటీర్ల తొలగింపు

సత్తెనపల్లి, మార్చి29: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ కార్యక్రమంలో పాల్గొన్నందుకు పట్టణంలోని 11వ వార్డుకు చెందిన వలంటీర్లు కిరణ్ సాగర్, అఖిల్‌లను విధుల నుంచి తొలగించినట్టు మున్సిపల్ కమిషనర్ షమ్మి శుక్రవారం తెలిపారు. వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనరాదని తెలిపారు.

నాలుగు రోజుల పాటు రెండు ఎక్స్‌ప్రెస్‌ల రీషెడ్యూల్

గుంటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - బీబీనగర్ సెక్షన్‌లో చిట్యాల రైల్వేస్టేషన్ వద్ద అదనపు లూప్ లైన్ నిర్మాణానికి సంబంధించి నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా నాలుగురోజుల పాటు రెండు రైళ్లను రీషెడ్యూల్ చేస్తున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. శుక్రవారం నుంచే ఈ రీషెడ్యూల్ అమలులోకి వచ్చింది. ఏప్రిల్ 1వ తేదీ వరకు నెంబరు. 17230 సికింద్రాబాద్ - త్రివేండ్రం సెంట్రల్ శబరి ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్యాహ్నం 1.20కి బయలుదేరుతుంది. అలానే నెంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా ఉదయం 8.40కి బయలుదేరుతుంది. అలానే మార్గమధ్యలో ఈ రైలుని సుమారు గంట పాటు నిలిపేస్తారు.

వైసీపీకి మాజీ సర్పంచ్ రాజీనామా



యెనుముల పున్నారెడ్డి

గురజాలటౌన్, మార్చి 29: మండలంలోని జంగ మహేశ్వరపురం మాజీ సర్పంచ్ యెనుముల పున్నారెడ్డి వైసీపీకి రాజీనామా చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కీలకంగా వ్యవహరించానని, గ్రామంలో వైసీపీ నేతలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

గెలిస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

● చెత్తపై పన్నువేసిన చెత్త ముఖ్యమంత్రి జగన్: కన్నా



ప్రజలకు అభివాదం చేస్తున్న శ్రీకృష్ణ దేవరాయులు, కన్నా

ముప్పాళ్ళ మార్చి 29: రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం అనుకుంటేనే ఓటు వేయాలని, నిజాయితీ నిబద్ధత కలిగినవారిని గెలిపించాలని నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, టీడీపి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ఇరుకుపాలెం, రుద్రవరం, తొండపి, దమ్మాలపాడు, బొల్లవరం, ముప్పాళ్ళ గోళ్ళపాడు, కుందురువారిపాలెం, లంకెలకూరపాడు, పలుదేవర్లపాడు గ్రామాల్లో శుక్రవారం బీజేపి, జనసేన నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ వరికెపూడిశెల ప్రాజెక్టును పూర్తిచేసి తాగునీటి సమస్యలను తీరుస్తానన్నారు. కన్నా మాట్లాడుతూ చెత్తపై పన్నువేసిన చెత్త ముఖ్యమంత్రి జగన్ అన్నారు. రాష్ట్రం ఆర్థికంగా వెనుక బడిందన్నారు. ముప్పాళ్ళలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, సర్పంచులు మల్లవరపు చంద్రశేఖర్, పోలూరి యలమంద, పాతూరి అయోధ్య, గోగినేని కోటేశ్వరరావు, రావిపాటి మదుబాబు, నానయ్య, గంగారాం ఖాశిం, లీలాఫర్, మాభుసుభాని, రవీంద్రారెడ్డి, శిరిగిరి వెంకటరావు, తోడేటి రవి, మనోజ్, అబ్దుల్ మజీద్, అత్తోట కృష్ణ, డివి నారాయణ, ఉగ్గం యలమందరావు, గుత్తా రామారావు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో బారీగా టీడీపీలో చేరికలు

మండల టీడీపీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీ నాయకులు కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, కన్నా లక్ష్మీనారాయణలు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇరుకుపాలెంలో ఎంపీటీసీ బత్తుల విజయలక్ష్మి ఆమె భర్త రామకృష్ణ మరికొందరు, కూరపాడులో యర్రం మస్తాన్‌రెడ్డి, యర్రం అప్పిరెడ్డి, మలిరెడ్డి చంద్రారెడ్డి, మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి(పెదకాపు), మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మలిరెడ్డి బ్రహ్మారెడ్డి, ఎస్‌కే మస్తాన్‌వలి, పలుదేవర్లపాడులో ఉపసర్పంచ్ లావు సాంబశివరావు, కంచేటి కుచేలరావు, చక్రవరపు బ్రహ్మారాజు మరో 10మంది, ముప్పాళ్ళలో 10 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

కార్యకర్తలే టీడీపీకి శ్రీరామరక్ష

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



ఎన్టీఆర్, డాక్టర్ కోడెల ప్రతిమలకు నివాళులర్పిస్తున్న జీవీ ఆంజనేయులు, డాక్టర్ చదలవాడ, డాక్టర్ కడియాల, గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు

నర సరావుపేట టౌన్, మార్చి 29: టీడీపీ జెండాలు మోసిన లక్షలాదిమంది కార్యకర్తల కృషి మరచిపోలేనిదని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయం ఆవరణలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అన్న ఎన్టీ రామారావు, డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రతిమలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కార్యకర్తలే టీడీపీకి శ్రీరామరక్ష అనిఅన్నారు. పార్టీ ఆశయసాధన కోసం కృషిచేస్తున్న ప్రతి కార్యకర్తలకు శుభాకాంక్షలు, ధన్యవాదాలు తెలిపారు. దేశ చరిత్రలోనే మహిళలకు ఆస్తిహక్కు కల్పించిన ఘనత అన్న ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ 42 ఏళ్ళుగా పార్టీకి అండగా ఉండి, పార్టీకి వెన్నంటి కార్యక్రమాలు ముందుకు తీసుకెళుతున్న నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి కొట్టా కిరణ్‌కుమార్ ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, యువనేత డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, అట్లా చినవెంకటరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రియాదవ్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, వేములపల్లి వెంకటనరసయ్య, కొల్లి ఆంజనేయులు, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు, అడుసుమల్లి అప్పారావు, టీడీపీ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ మాబు, టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అధ్యక్షుడు పూదోట ఆంథోని సునీల్‌కుమార్, రావర్ల జగ్గారావు, మైనారిటీ సెల్ నియోజకవర్గ అధికార ప్రతినిధి షేక్ మన్నాన్ షరీఫ్, కనుమూరి లక్ష్మి, దాసరి ఉదయశ్రీ, అల్లంశెట్టి మోహనరావు, జాగర్లమూడి హనుమంతురావు పాల్గొన్నారు.

రూ. 1.16 కోట్ల నగదు సీజ్

గుంటూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున ఈసీ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి పత్రాలులేకుండా తీసుకెళుతున్న నగదుని వివిధ శాఖలు స్వాధీనం చేసుకొంటున్నాయి. కోడ్ అమలులోకి వచ్చినరోజు నుంచి శుక్రవారం వరకు జిల్లావ్యాప్తంగా రూ.1.16 కోట్లను సీజ్‌చేశాయి. పోలీసుశాఖ రూ.70లక్షల వరకు నగదుని స్వాధీనం చేసుకొన్నది. సీజీఎస్‌టీ రూ.40లక్షలు, ఎస్‌జీఎస్‌టీ రూ.3లక్షలు, మిగతా శాఖలు కలిపి మరో రూ.3లక్షల వరకు నగదుని స్వాధీనపర్చుకొన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ఎం వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో కళాశాల లైబ్రేరియన్

● సస్పెండ్ చేస్తూ ఇంటర్‌బోర్డు ఉత్తర్వులు

గుంటూరు(విద్య), మార్చి 29: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ ఇంటర్‌బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. పెనుమాకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న మస్తాన్‌వలి డిప్యూటేషన్‌పై ఎమ్మెల్యే ముస్తాఫా వద్ద పీఏగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ సదరు ఉద్యోగి తూర్పు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూరిఫాతిమా తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడు. దీనిపై ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి విచారణ చేయాల్సిందిగా ఇంటర్ బోర్డు అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్లు నివేదిక అందడంలో లైబ్రేరియన్ మస్తాన్‌వలిని సస్పెండ్ చేస్తూ ఇంటర్ బోర్డు అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00



బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ఆ డబ్బంతా ఉద్యోగుల వేతనాలు

● బురద చల్లే పనులు మానుకోవాలి

● ఏడాదికి రూ.10కోట్లు ట్యాక్స్ చెల్లిస్తున్నా

● బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన


మాట్లాడుతున్న నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 29: రాయల్ మెరైన్ ఫ్యాక్టరీలో ఉద్యోగుల జీతాల కోసం తెచ్చిన రూ.56లక్షలను ప్రభుత్వాధికారులు సీజ్ చేశారని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఈ విషయమై శుక్రవారం ఆయన వివరణ ఇస్తూ గుంటూరు స్టేట్ బ్యాంక్ శాఖ నుంచి రూ.60 లక్షలు ఫైనాన్స్ మేనేజర్ తీసుకొచ్చి నిజాంపట్నంలోని రాయల్ మెరైన్ కంపెనీలో రూ.4 లక్షలు పేమెంట్ చేశారని తెలిపారు. మిగిలిన రూ.56 లక్షలు అక్కడ నుంచి వేరొక కంటైనర్ ద్వారా ఫ్యాక్టరీకి పంపించామన్నారు. ఎన్నికల నియమావళికి సంబంధించి అధికారుల తనిఖీలో డబ్బులు సీజ్ చేశారన్నారు. దీనికి సంబంధించి అన్ని లెక్కలు పక్కాగా ఉన్నాయన్నారు. దీనిపై వైసీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు ప్రచారం చేయటాన్ని ఆయన తప్పుపట్టారు. తాను రాజకీయ నాయకుని కంటే ముందు బాధ్యత గల పౌరుడునని గుర్తు చేశారు. సంవత్సరానికి రూ.10కోట్ల ఆదాయ పన్నుశాఖకు కడుతున్నట్లు తెలిపారు. వేగేశన ఫౌండేషన్ ద్వారా రాజకీయాలకు అతీతంగా దశాబ్దాకాలంగా నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తున్న తనపై వైసీపీ శ్రేణులు బురదజల్లే పనులు మానుకోవాలన్నారు. ఈవిధంగా ఉద్యోగుల పొట్టకొట్టి వాళ్ళను రోడ్డుపాలు చేస్తానంటే చూస్తూ ఊరుకునేదిలేదని ఎమ్మెల్యే కోన రఘుపతికి సవాల్ విసిరారు.

సామాజిక మాధ్యమాలలో అసత్యప్రచారం చేస్తే చర్యలు : ఎస్పీ



ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల,మార్చి29 : సామాజిక మాధ్యమాలలో నిరాధారమైన, అసత్యాలను ప్రచారం చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఈవిషయమై శుక్రవారం ఆయన మాట్లాడుతూ సైబర్ విభాగం నిష్ణాతులైన పోలీసు అధికారులతో సామాజిక మాధ్యమాలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర గ్రూప్‌లలో తప్పుడు సమాచారం ప్రచారమైతే గ్రూప్ అడ్మిన్‌దే పూర్తి బాధ్యత అన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలలో ఉన్నందున సామాజిక మాధ్యమాలలో వ్యక్తిగత దూషణలు, ట్రోలింగ్‌లు, తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. సరైన సమాచారం లేకుండా ప్రజలను తప్పుదోవపట్టించేలా నిరాధార పోస్టులు, వార్తలు సామాజిక మాధ్యమాలలో ఉంచిన, ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెదిరింపులకు పాల్పడే పోస్ట్ చేయబడితే దానికి పూర్తిబాధ్యత గ్రూప్ అడ్మిన్ వహించాల్సి వస్తుందన్నారు. అభ్యంతకర, ఫేక్ న్యూస్, వదంతులు ప్రచారం చేసే వారి గురించి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత గ్రూప్ అడ్మిన్‌పై ఉంటుందన్నారు. గ్రూప్ అడ్మిన్ చర్యలు తీసుకోకుంటే వారిపై ఐపీసీ సెక్షన్ 153ఎ, సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. దేశభద్రతకు ముప్పు కలిగించేవి, కుల, మత, వర్గ పోరుకు దారితీసేవి, రాజకీయవిద్వేషాలు రెచ్చగొట్టేవి, తప్పుడు సమాచారం, అసభ్యకర, అభ్యంతర నేరపూరితమైన బెదిరింపులకు పాల్పడేవి, వ్యక్తిగత పరపతి, మనోభావాలు దెబ్బతీసేవిధంగా మార్ఫింగ్ చేసిన ఫొటోలు, వీడియోలు, ప్రజలను తప్పుదారి పట్టించే సమాచారం, ఇతరులకు ఎట్టి పరిస్థితులలో షేర్ చేయకూడదని సూచించారు. ఇలాంటివి తెలిసిన యెడల స్థానిక పోలీసులకు లేదా ఎస్పీ కార్యాలయ హెల్ప్‌లైన్‌నెంబరు 8333813228కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వెంటనే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలి

● ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ అహ్మద్


కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ అహ్మద్

బాపట్ల టౌన్, మార్చి 29 : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదివితే ఉన్నత ఉద్యోగాలు సులభంగా సాధించవచ్చునని ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌తోపాటు ఆంగ్ల భాషపై పట్టు ఎంతో అవసరమన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానంతో ఉద్యోగావకాశాలు సాధించవచ్చునన్నారు. కళాశాలలో ఎంతోమంది విద్యార్థులు ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం ఇతరదేశాలు, రాష్ట్రాలలో స్థిరపడ్డారన్నారు. డిగ్రీ కోర్సు తర్వాత పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సును చదివి ఉద్యోగావకాశాలను పొందాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరింపచేశాయి. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసాద్, బలరాం, విద్యార్థులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని అభినందించిన డాక్టర్ ఉమ్మారెడ్డి

బాపట్ల,మార్చి 29 : బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాల్గవసారి ఎన్నికైన విన్నకోట సత్యప్రసాద్‌ను శాసనమండలి చీఫ్‌విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు శుక్రవారం అభినందించారు. చిన్న వయస్సులోనే అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పనిచేయటమే కాకుండా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాలుగుసార్లు ఎన్నిక కావటం అభినందనీయమన్నారు. న్యాయవాదుల సమస్యలపై బార్ అసోసియేషన్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని అంకితభావంతో మరింత బాధ్యతగా పని చేస్తూ న్యాయవాదిగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. అదేవిధంగా మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ నరాలశెట్టి ప్రకాశరావు, బూర్లె అనీల్‌కుమార్ తదితరులు కూడా సత్యప్రసాద్‌కు అభినందనలు తెలిపి సత్కరించారు.

పేదలకు దుస్తుల పంపిణీ

కర్లపాలెం, మార్చి 29 : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని నిరుపేద ముస్లింలకు అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పఠాన్ అహ్మద్‌బాషా, ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు, షేక్ ఇబ్రహీం, సయ్యద్‌రఫీ, షేక్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

కొత్త శంకరరావు మృతి

కర్లపాలెం, మార్చి 29 : కర్లపాలెంలోని కల్యాణ శ్రీనివాస రైస్‌మిల్లు పార్టనర్ కొత్త శంకరరావు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం సాయంత్రం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. శంకరరావు మృతదేహాన్ని రైస్‌మిల్లర్స్ పలువురు సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పెనుమర్రులో వైసీపీ బోర్డులు తొలగింపు

వేమూరు, మార్చి 29 : మండలంలోని పెనుమర్రులో తొలగించని వైసీపీ బోర్డులు అంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం గ్రామంలో ఉన్న వైసీపీ బోర్డులు, సీఎం జగన్ బొమ్మతో ఉన్న ప్రచార బోర్డులు పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోల పర్యవేక్షణలో వాటిని తొలగించారు.


ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని


పార్టీశ్రేణులతో కలిసి తెలుగుదేశం జెండా ఆవిష్కరిస్తున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

తెలుగుజాతి ఆత్మగౌరవానికే టీడీపీ స్థాపన

● మాజీ మంత్రి ఆనందబాబు

భట్టిప్రోలు, మార్చి 29 : తెలుగుజాతి ఆత్మగౌరవం, ఉన్నతి, ఔన్నత్యం కాపాడేందుకే ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. 42 వసంతాల తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని గ్రామాల్లో టీడీపీ శ్రేణులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన వ్యవస్థాపక దినోత్సవంలో మాజీ మంత్రి ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్యలు పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించిన 9 నెలల కాలంలోనే ఎన్టీఆర్ టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. అదే బాటలో చంద్రబాబునాయుడు పార్టీని ముందుకు తీసుకువెళ్తూ దేశ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకువచ్చారన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబునాయుడు ప్రపంచ దేశాలలో తెలుగువారి గౌరవాన్ని నిలబెట్టారన్నారు. 2019లో ప్రజలు చేసిన పొరపాటు వల్ల వైసీపీ అధికారంలోకి వచ్చి ముందుకు వెళ్తున్న రాష్ట్రం 20 ఏళ్ళు వెనక్కి వెళ్ళిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం జగన్‌రెడ్డి రాజ్యాంగ వ్యవస్థల్ని భ్రష్టుపట్టించడమే కాక హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, కుట్ర పూరిత రాజకీయాలతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు. లక్షలాది మంది యువతకు చంద్రబాబు ఉపాధి అవకాశాలు కల్పిస్తే సీఎం జగన్‌రెడ్డి యువతను గంజాయికి, మాదక ద్రవ్యాలకు బానిసల్ని చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణం నిబద్ధత, చిత్తశుద్ధి కలిగిన చంద్రబాబు ద్వారానే సాధ్యపడుతుందని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడిగా ఎన్నికలకు వెళ్ళేందుకు పూనుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, మండల కన్వీనర్ వాకా శేషుబాబు, జనసేన నాయకులు వై.శ్రీనివాసరావు, నాయకులు కనపర్తి సుందరరావు, బట్టు మల్లికార్జునరావు, వై. జయశీలరావు, జంగం శ్యాంసన్, రాయన ప్రసాద్, రాజులపాటి వెంకటేశ్వరరావు, కంభం సుధీర్ పాల్గొన్నారు.

● బాపట్ల, మార్చి 29 : బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీశ్రేణులతోకలిసి దివంగత ఎన్టీరామారావు విగ్రహానికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ పుష్పాంజలి ఘటించి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ విలువలతో కూడిన పార్టీగా తెలుగుదేశం పార్టీ గుర్తింపు పొందిందన్నారు. నాలుగు దశాబ్దాలుగా రాష్ట్రంలో పేద, బలహీనవర్గాల ప్రజలకు అండగా ఉంటుందన్నారు. పార్టీ అభివృద్ధి కోసం శ్రమించే ప్రతి కార్యకర్తకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం పనిచేసి ప్రత్యర్థుల భౌతికదాడులలో అశువులు బాసిన కార్యకర్తలకు శ్రద్ధాంజలి ఘటించారు. రానున్న ఎన్నికలలో ప్రతి ఒక్కరు సైనికునివలే పనిచేసి విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, నాయకులు బీమా లీలాకృష్ణ, ఊట్ల రామారావు, పరిశా రమేష్ గౌడ్, చెన్నుపాటి కిషోర్, మునేశ్వరరావు, గేరా చార్లెస్, తోట నారాయణరావు, ఉప్పాల కృష్ణగౌడ్, ఇనగంటి గాంధీ, వెంకట్రావు, ఆచంట విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, మార్చి 29 : పిట్టలవానిపాలెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు ఎండి అఫ్జల్, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేటీల సంయుక్త ఆధ్వర్యంలో మండల, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలతో కలిసి టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. తొలుత పార్టీశ్రేణులు టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల అర్పించారు. పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని స్థాపించి భారతదేశంలో తెలుగువారి ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేసిన ఘనుడు ఎన్టీఆర్ అని అన్నారు. ఎన్టీఆర్ సేవలను పార్టీ నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ సీనియర్ నాయకులు లక్కం రాజు వెంకటపతిరాజు, భవనం బసివిరెడ్డి, కనుమూరి సాంబమూర్తి రాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బడుగు కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి పిట్టు సాయిబాబారెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు మోదుగుల శంకరరెడ్డి, బాపట్ల నియోజకవర్గ టీడీపీ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి కలకోట కిషోర్‌రెడ్డి, టీడీపీ మండల మైనార్టీనాయకుడు షేక్ మీరా, మాజీ ఎంపీపీ బొలగాని సులోచ నారాయణ, చందోలు గ్రామ టీడీపీ యువనాయకులు సయ్యద్ నిజాం, సలీం, బర్మా పీటర్‌పాల్, బర్మా నరసయ్య, బర్మా జాన్సీ, గోవతోటి దీనబాబు, మాజీ కో ఆప్షన్ సభ్యులు మద్దాల డేవిడ్, కలకోట చక్రధర్‌రెడ్డి, చందోలు కోటి లింగాచారి, గూడారి వెంకయ్య, మోదుగు సుబ్బారెడ్డి, పమిడి వెంకటరామయ్య, యేమినేని శ్రీనివాసరావు, గోపిరాజు, పందరబోయన విష్ణువర్ధన్, నిజాంపట్నం నాగరాజు, మన్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● చుండూరు మార్చి 29 : తెలుగుదేశం ఆవిర్భావం తరువాతే రాష్ట్రంలో రాజకీయ చైతన్యం, తెలుగు వారికి ప్రపంచ వ్యాప్త గుర్తింపు లభించాయని టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వలివేరులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలకు పరిపుష్టి కల్పించిన చంద్రబాబు తెలుగుజాతి కీర్తిని ప్రపంచ వ్యాప్తం చేశారన్నారు. చుండూరు పార్టీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షులు గూదేటి ఎల్లారెడ్డి, కుర్రి వెంకటరెడ్డి, పెదగాదెలవర్రులో కంఠంనేని రాహుల్, మండూరులో దేవిరెడ్డి నాగేశ్వరరావు, చెక్కా బుచ్చయ్య, కేశం శ్రీనివాసరావు, జొన్నకూటి సాంబశివరావు, అశోక్, షేక్ కాశిం, విజయప్రకాష్, మస్తాన్, రాంబాబు, మన్నవ రాజశేఖర్, సీతయ్యలు పాల్గొనగా యడ్లపల్లి, వేటపాలెం, మోదుకూరు, మున్నంగివారిపాలెం, దుండిపాలెం, చినపరిమిలో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

● కర్లపాలెం, మార్చి29 : కర్లపాలెంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు తెలుగుదేశంపార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నక్కల వెంకటస్వామి, జడ్పీటీసీ పిట్టల వేణుగోపాలరెడ్డి, మాజీ జడ్పీటీసీ గుంపుల కన్నయ్య, న్యాయవాది బెజ్జం వెంకటేశ్వర్లు, పిట్ల వసంతరెడ్డి, షేక్ బాజీ, రఫీ, పమిడి రవి, పులుగు సముద్రాలురెడ్డి, సమ్మెట నాగేంద్రరెడ్డి, రాజశేఖర్, చిన్న, బుల్లియ్య, ఏడుకొండలు, వెంకటేశ్వరరెడ్డి, మెకానిక్‌బాబు, జనసేనపార్టీ మండలాధ్యక్షులు గొట్టిపాటి శ్రీకృష్ణ, చిలకల సురేంద్ర పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో గుడ్ ఫ్రైడే


వేమూరు చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవ మహిళలు

వేమూరు, మార్చి 29 : మండల పరిధి గ్రామాల్లోని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకను శుక్రవారం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. క్రీస్తు గీతాలాపాలను ఆలపించారు. పాస్టర్లు పండుగ విశిష్టతను వివరించారు. చర్చిలు, శ్మశాన వాటికలను పూలమాలలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి దానధర్మాలు చేశారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


● భట్టిప్రోలు, మార్చి 29 : మండలంలోని క్రీస్తు దేవాలయాల్లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భట్టిప్రోలు క్రీస్తు రక్షకుని దేవాలయంలో విచారణ గురువులు క్రీస్తు సందేశాన్ని అందించారు. ఆయా చర్చిలలో ఫాదర్‌లు వాక్యోపదేశం చేస్తూ ప్రపంచ మానవాళి పాప విమోచన కోసం ఏసుక్రీస్తు శిలువను ఎక్కి శాంతి, సన్మార్గాన్ని అందించాడని, ఏసుక్రీస్తు అం దరి దేవుడని తెలియజెప్పారు. క్రీస్తుభవన్ ఆధ్వర్యంలో శిలువను భుజాన పెట్టుకుని మోస్తున్న ఏసుక్రీస్తు వేషధారణలో క్రీస్తుభవన్ వద్ద నుంచి గ్రామ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పానకం పంపిణీ చేశారు. చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

● పిట్టలవానిపాలెం, మార్చి 29 : గుడ్‌ఫ్రైడే వేడుకలను మండల వ్యాప్తంగా క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాలైన చందోలు పెదహరిజనవాడ, కత్తివారిపాలెం, ఖాజీపాలెంలోని మండేవారిపాలెం, గడ్డంవారిపాలెం, అలకాపురంలోని మండేవారిపాలెం, అల్లూరులోని నత్తలవారిపాలెం, పిట్టలవానిపాలెంలోని ఎస్సీ కాలనీ, మంతెనవారిపాలెంలోని ఎస్సీకాలనీలో, కొత్తపాలెం, సంగుపాలెం గ్రామాలలో గుడ్‌ఫ్రైడే వేడుకలలో క్రైస్తవులు పాల్గొని ఆయా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకున్నారు. ఆయా చర్చిలలోని దైవజనులు ఏసుప్రభువు గొప్పతనాన్ని కీర్తించారు. ఈ సందర్భంగా అన్ని ప్రార్థన మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు.

● కర్లపాలెం, మార్చి 29 : కర్లపాలెం మండలంలోని పేరలి గ్రామంలో శిలువయాత్రను క్రైస్తవులు శుక్రవారం ఘనంగా నిర్వహించి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని పలు చర్చిలలో, పలుగ్రామాలలో గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పేరలి గ్రామంలో శిలువతో ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ మానవాళి పాపాలను కడిగివేయటానికి ఏసుక్రీస్తు శిలువ మరణం పొందినట్లు క్రైస్తవ ఫాదర్‌లు, పాస్టర్‌లు, సంఘస్థులు వివరించారు. పేరలి గ్రామానికి చెందిన కాగిత విజయరాజు శిలువ మోస్తూ క్రైస్తవ భక్తిగీతాలతో గ్రామంలో శిలువ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో వందల సంఖ్యలో క్రైస్తవ భక్తులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

● కొల్లూరు, మార్చి 29 : గుడ్ ఫ్రైడే పురస్కరించుకుని క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం కొల్లూరులోని లూథరన్ చర్చితో పాటు పలు ప్రార్థనాలయాల్లో క్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటల గురించి భక్తులకు పాస్టర్లు వివరించారు. అనంతరం తమ పెద్దల సమాధుల వద్ద పండుగ ఏర్పాట్లు చేసుకున్నారు.

క్రాపలో ఆనందబాబు విజయం కోరుతూ ప్రచారం


ఆనందబాబు విజయం కోరుతూ ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

కొల్లూరు, మార్చి 29 : మండల పరిధిలోని క్రాపలో శుక్రవారం పార్టీ శ్రేణులు ఇంటింటికి తిరుగుతూ ఉమ్మడి అభ్యర్థి ఆనందబాబుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ, బాబు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు. ప్రచార కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, గ్రామపార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి మధు, సర్పంచ్ క్రాప మునిమ్మ, పార్టీ నాయకులు గోపయ్య, మోహన్, కోగంటి హరిబాబు, ధనుంజయ్, పండబ్బాయి, మన్నే శ్రీను, అనీల్, యలవర్తి కోటేశ్వరరావు, వెంకటకృష్ణారావు, రాంబాబు, కొడాలి వెంకటనారాయణ, ఎంపీటీసీ రాంబాబు, ధూళిపాళ్ల వెంకటేశ్వరరావు, నాగళ్ల రత్నబాబు, సాయిబాబు, ఎన్నారై మణికంఠ, వేములపల్లి మోహనకృష్ణ, సుంకర రాంబాబు, జీఎల్‌జీ భగవాన్, గుమ్మడి శివ, కోగంటి శివవెంకటేశ్వరరావు, కృష్ణ, రావుల రమేష్, తుమ్మల బాపయ్య చౌదరి, మున్నంగి విజయ్, శిగిలిశెట్టి రాఘవరావు, తోట సాంబయ్య, పులివర్తి నాంచారయ్య, యడ్ల శ్రీను, పోతార్లంక కుటుంబరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం


నగరం, మార్చి 29 : మండలంలోని ఏలేటిపాలెం పంచాయతీ బుట్టావారిపాలెం గ్రామంలో కైతేపల్లి సాయిలక్ష్మీ పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ప్రక్కనే ఉన్న గూడవల్లి శ్రీనివాసరావు, భీమవరపు నాగుల మీరా ఇల్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. దీంతో పాటు పాడి గేదెలు మంటల్లో చిక్కుకుని సగబాగం కాలిపోయ్యాయి. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు.

● అమృతలూరు, మార్చి 29 : మండల పరిధిలోని గోవాడలో ఒక రైతుకు చెందిన ఎకరం గడ్డిని మరో రైతు కొనుగోలు చేసి తరలిస్తున్నాడు. మార్గమధ్యంలో విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ వెంటనే హైడ్రాలిక్ ద్వారా గడ్డిని కిందకు పడవేయడంతో ప్రమాదం తప్పింది. గడ్డి మొత్తం అగ్నికి ఆహుతైంది.

తెలుగు వాడి ఆత్మగౌరవాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన ఎన్టీఆర్

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మార్చి 29 : తెలుగువాడి కీర్తిప్రతిష్టలను ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు సమానత్వం కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. పార్టీని స్థాపించి 9 నెలలలోనే టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చి పేద, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. ప్రపంచంలో ఎక్కడైన తెలుగువాడు తలెత్తుకుని బతికేలా చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. బీసీల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, టీడీపీ రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి పంతాని మురళీధరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వేములపల్లి సుబ్బారావు, బాపట్ల జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి తాతా ఏడుకొండలు, టీడీపీ నాయకులు గోగినేని పట్టాభిరామారావు, జీవీ నాగేశ్వరరావు, కొలసాని రాము తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, టీడీపీ నాయకులు

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం : అనగాని

రేపల్లె, మార్చి 29: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచెయ్యాలని పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయిబ్రాహ్మణ అధ్యక్షుడు మోపిదేవి శివకృష్ణ, కొమరవోలు మధు, తంగెళ్ళమూడి సుబ్బారావు, కొడాలి యేగేందర్, కొడాలి ఆనంద్‌లకు ఎమ్మెల్యే అనగాని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వమేనని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, బాపట్ల జిల్లాస్థాయి బ్రాహ్మణ అధ్యక్షులు కొనికి వెంకట్రావు, కొడాలి సాంబశివరావు, గూడపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సర్పంచ్, మాజీ సర్పంచ్ టీడీపీలో చేరిక

● స్వాగతించిన మాజీ మంత్రి ఆనందబాబు

అమర్తలూరు, మార్చి 29 : మండలంలోని వైసీపీకి చెందిన సర్పంచ్, మాజీ సర్పంచ్‌తో పాటు పలువురు సభ్యులు టీడీపీలో చేరారు. శుక్రవారం రాత్రి వేమూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కుచ్చెళ్ళపాడు గ్రామ సర్పంచ్ గాజులు వెంకట సుబ్బయ్య, విద్యుత్ శాఖ రిటైర్డ్ ఏఈ తాడికొండ రామకృష్ణారావు, అబ్బనగూడవల్లి మాజీ సర్పంచ్ కొండిశెట్టి వెంకట సుబ్బారావు టీడీపీలో చేరారు. వారితో పాటు కుచ్చెళ్ళపాడు గ్రామానికి చెందిన వైసీపీ శ్రేణులు తాడికొండ రవికిషోర్, తాడికొండ సుబ్బారావు, పెనుమూడి వెంకట సుబ్బారావు, పెనుమూడి సురేష్, కొల్లూరు గోపికృష్ణ, పెరికల విజయేంద్రబూసే, నరేష్, పెరికల బాబురావు, తాడికొండ రంగారావు, తాడికొండ విశ్వేశ్వరరావు, పెరికల బుజ్జి కూడా పార్టీలో చేరారు. వారికి మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊస రాజేష్, పార్టీ నాయకులు తాడికొండ వెంకట సుధీర్, తులం రమేష్‌బాబు, రాజేష్, టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.


కుచ్చెళ్ళపాడు సర్పంచ్ వెంకట సుబ్బయ్యను కండువా కప్పి పార్టీలోకి స్వాగతిస్తున్న ఆనందబాబు

పేదలకు మంచి జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలి

అమృతలూరు, మార్చి 29 : పేదలకు మంచి జర గాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావా లని నక్కా అఖిలేశ్ అన్నా రు. శుక్రవారం అమృతలూరులో తన తండ్రి నక్కా అనందబాబుకు మద్దతుగా ఎన్నికల ప్రచా రం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్స్, నిరుద్యోగులకు యువగళం నిధి కింద నెలకు రూ.3 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆయన వెంట టీడీపీ మండల, స్థానిక, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అనగాని గెలుపునకు కృషి చేయాలి

రేపల్లె, మార్చి 29 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు అండగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము అన్నారు. నిజాంపట్నం మండలం కూచినపూడి పంచాయతీ కర్రివారిపాలెం, దున్నావారిపాలెం, కొత్త ఎస్టీ కాలనీలో శంఖారావం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందిస్తూ ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు నల్లపాటి యల్లయ్య, బొర్రా సురేంద్రబాబు, గురిందపల్లి రామారావు, ఇమ్మిడిశెట్టి శ్రీనివాసరావు, బొర్రా సాంబయ్య, ఉప్పాల నాగయ్య, యేమినేని బుల్లిబాబు, జనసేన నాయకులు నరేష్‌యాదవ్, అడిసిమల్లు స్వాములు, మేకా రాజేష్, బొప్పా లక్ష్మయ్య, బొర్రా శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

వైసీపీ చేర్పుల్లో రేషన్ డీలర్లు, డ్వాక్రా సమాఖ్య నాయకురాళ్ళు

రేపల్లె, మార్చి 29 : రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో, పార్టీల చేర్పుల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనరాదని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినా రేపల్లె నియోజకవర్గంలో మాత్రం అందుకు విరుద్ధంగా వైసీపీ నాయకులు, అధికారాన్ని అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని తీరప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజాంపట్నం మండలం ప్రజ్ఞం గ్రామంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు, వైసీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ ఆధ్వర్యంలో చేరారు. ఈ చేర్పుల సమయంలో ప్రజ్ఞంకు చెందిన రేషన్ డీలర్ పోలిశెట్టి పూర్ణచంద్రరావు, వల్ల వెంకటేశ్వరరావు, డ్వాక్రా సమాఖ్య సంఘం అధ్యక్షులు పరిశా శ్రీలక్ష్మీ పాల్గొని ప్రచారం నిర్వహించారు.

నేడు మల్లేశ్వర స్వామి పునఃప్రతిష్ఠ


అనుగ్రహ భాషణ చేస్తున్న విద్యారణ్య భారతీ మహాస్వామి

కొల్లూరు, మార్చి 29 : గంగా పార్వతీ సమేత అనంత భోగేశ్వరస్వామి ఆల యంలో మల్లేశ్వర స్వామి, నందీశ్వరుడి పునఃప్రతిష్ఠ మహోత్సవం శనివారం నిర్వహించనున్నారు. మల్లేశ్వరస్వామి, నందీశ్వరుడి విగ్రహాలకు శుక్రవారం పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం హంపి విరూపాక్ష మహాసంస్థాన అధిపతి విద్యారణ్య భారతీ మహాస్వామి వారు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. శనివారం ఉదయం 11.45 నిమిషాలకు విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి అనుగ్రహంతో చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ యడ్ల వెంకటేశ్వరరావు, ఈవో అనుపమ తెలిపారు. ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన ఎన్టీఆర్

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

» ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు

మార్టూరు, మార్చి 29: తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన ఘనత ఎన్టీ రామారావుకే దక్కుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శుక్రవారం మార్టూరులోని పార్టీ కార్యాలయంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే సాంబశివరావు, టీడీపీ బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్ కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ మహిళలకు ఆస్తిహక్కు, స్థానిక ఎన్నికలలో బీసీలకు, మహిళలకు రిజర్వేషన్లు కల్పించడంలో ఎన్టీఆర్ కృషిని ఎవరూ మరవలేరన్నారు. చంద్రబాబు నాయకత్వంలో మన రాష్ట్రం అభివృద్ధిపథం వైపు పయనిస్తుండగా, ప్రజలను మోసం చేసి జగన్ రెడ్డి అధికారంలో వచ్చారన్నారు. మరోసారి ప్రజలను మోసంచేసి అధికారంలోకి రావ డానికి బస్సు యాత్రతో ప్రజలలోకి వస్తున్న జగన్ కు బాయ్‌బాయ్ చెప్పాలన్నారు. రాష్ట్రాన్ని జగన్ రెడ్డి కబంధ హస్తాల నుంచి కాపాడుకోవడానికి టీడీపీ, జనసేన బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పర్చూరుతో పాటు బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రుల ఆరాధ్య దైవం స్వర్గీయ ఎన్‌టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ నుంచి బాపట్ల ఎంపీగా పోటీ చేస్తుండటం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే సాంబశివరావు సహాయ సహకారాలు అందించడంతో బాపట్ల బరిలో తన గెలుపు ఖాయమవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు

పార్టీ కార్యాలయం వద్ద జండాను ఎమ్మెల్యే ఏలూరి ఎగురవేశారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి సాంబశివరావు, కృష్ణప్రసాద్‌లు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు, కామినేని జనార్దన్, షేక్ రజాక్, కమ్మ శివనాగేశ్వరరావు, మిన్నెకంటి రవికుమార్, గొట్టిపాటి వెంకట్రావు, పోలూరి సింగయ్య, రావినేని శ్రీను, జాష్టి సాంబశివరావు, శివరాత్రి శ్రీను, శానంపూడి చిరంజీవి, జాగర్లమూడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు: తెలుగుదేశం పార్టీ 42వ ఆవర్భావ దినోత్సవ వేడుకలు పర్చూరు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో శుక్రవారం తెలుగు తమ్ముళ్ళు ఘనంగా నిర్వహించారు. పర్చూరులోని పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. కారంచేడు మండల కేంద్రంలోని గ్రామపార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో భాగంగా యార్లగడ్డ సుబ్బమ్మ రజని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అద్దంకిలో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

దార్శనికుడు ఎన్టీఆర్

చీరాల, మార్చి 29: శ్రమశక్తిని గుర్తించిన దార్శనికుడు ఎన్టీ రామారావు అని కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ జెండాను కొండయ్య ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ చైతన్యానికి నాంది పలికిన పార్టీ టీడీపీ అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుని చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.



చీరాల టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఎగురవేస్తున్న కూటమి అభ్యర్థి కొండయ్య

టీడీపీ విజయానికి కలిసికట్టుగా పనిచేయాలి

అద్దంకి, మార్చి 29: టీడీపీ విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని టీ డీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ అన్నారు. టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం స్థానిక పోతురాజుగండిలోని పార్టీ కార్యాలయంలో జరిగా యి. టీడీపీ జెండాను మహిళా కౌన్సిలర్‌లు ఎగురవేశారు. కార్యక్రమంలో టీడీపీ అద్దంకి పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు చిన్ని శ్రీనివాసరావు, కఠారి నాగేశ్వరరావు, నా గినేని రామకృష్ణ, కౌన్సిలర్‌లు కంపా రజనీ, జహీరా, గుంటూరు విజయలక్ష్మి, అత్తులూరి రమేష్, లహరి, నందమూరి కళాపరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, వద్దవల్లి పూర్ణచంద్రరావు, కాకాని అశోక్, కుందారపు రామారావు, యర్రాకుల రా మాంజనేయులు, బచ్చల వాసు, షేక్ మహబూబ్, కాసా పుల్లయ్య, పెంట్యాల రామాంజనేయులు, బిళ్ళపాటి రామాంజనేయులు, చిన్నవలి, నాగరాజు, రాఘవ, రహీమ్, వెంకట్రావు, రహమాన్, శివనారాయణ, కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మార్టూరులోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు , బాపట్ల ఎంపీ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్

చినగంజాం:మండలంలోని పలు గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాలయ ఆవరణలో మండల పార్టీ అధ్యక్షుడు పొద వీరయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాం అజాద్, టి.జయరావు, సందు శ్రీనివాసరావు, కొండ్రగుంట శ్రీహరి, నక్కల వీరరాఘవులు, మోటుమర్రి రామసుబ్బారావు, నరహరి శ్రీనివాసరావు, వడ్లమూడి సత్యనారాయణ, రాజు వెంకటేశ్వరరెడ్డి, వాటుపల్లి ఏడుకొండలు, కోకి భాస్కరరెడ్డి, ఎ.లాజరు, దేవతోటి నాగరాజు, పద్మావతి, వి.వెంకయ్య, షేక్ బాజీ, చినగంజాం, నీలాయపాలెం గ్రామ సర్పంచ్‌లు రాయని ఆత్మారావు, తూమాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం యద్దనపూడి మండల కేంద్రంలో పార్టీ జెండాను ఎగుర వేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నల్లపనేని రంగయ్య చౌదరి, గుదే తారక రామారావు, రావిపాటి సీతయ్య, కనపర్తి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



అద్దంకి పట్టణంలోని పసుమర్తిపాలెం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ యేసుబాబు

చినగంజాం, మార్చి 29: మండల పరిధిలోని గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే ఆరాధనలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవులు అత్యంత భక్తితో జరుపుకునే గుడ్‌ఫ్రైడే రోజున ఆయా చర్చిల్లో మరణానికి ముందు క్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను బోధించారు. సంతరావూరు, గొనసపూడి, చింతగుంపల్లి, కడవకుదురు, చినగంజాం, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం, మూలగానివారిపాలెం, పెదగంజాం తదితర గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా వేడుకల్లో క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చీరాల: చీరాల నియోజకవర్గ పరిధిలో శుక్రవారం పలు చర్చిల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జయంతిపేటలోని లూథరన్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ పాల్గొన్నారు. వేటపాలెం మండలంలో రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అద్దంకి: గుడ్ ఫ్రైడే సందర్భంగా అద్దంకి పట్టణంలోని పలు చర్చిలలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అద్దంకి పట్టణంలో శిలువ యాత్ర నిర్వహించారు. పసుమర్తిపాలెం చర్చిలో పాస్టర్ యేసుబాబు, బిళ్లాలు కాలనీలోని చర్చి లో ఇటికాల యోహాన్‌ల ఆధ్వర్యంలో దేవుని వాక్యాలు బోధించారు.

ఇంకొల్లు: మండలంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రిస్టియన్లు వైభవంగా జరుపుకున్నారు. చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు బోధనలను ఆచరించాలని హితవు పలికారు. గ్రామంలో సిలువను మోస్తూ భక్తిని చాటుకున్నారు.

చీరాలటౌన్: చీరాల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శుక్రవారం ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. స్థానిక మరియమ్మపేట సెయింట్ ఆంథోనీ చర్చి ఆధ్వర్యంలో క్రీస్తు సిలువ మోసిన ఇతివృత్తాన్ని ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మతబోధకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన హీరో నిఖిల్



లోకేష్‌కు మొక్క అందజేస్తున్న హీరో నిఖిల్ సిద్ధార్థ యాదవ్

చీరాల, మార్చి 29: చీరాల టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య కుమారులు గౌరీఅమర్‌నాథ్, మహేంద్రనాథ్‌లతో కలసి శుక్రవారం హీరో నిఖిల్ సిద్ధార్థయాదవ్ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిశారు. నిఖిల్ పూలమొక్కను మర్యాద పూర్వకంగా లోకేష్‌కు అందజేశారు. అనంతరం లోకేష్ మెడలో పార్టీ కండువావేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారి మధ్య చీరాల నియోజకవర్గంతో పాటు రాష్ట్ర రాజకీయాలపై కొంతసేపు చర్చ జరిగినట్లు సమాచారం. కొండయ్య కుమారుడు గౌరీఅమర్‌నాథ్ హీరో నిఖిల్ చెల్లెలను వివాహమాడారు.

బాధితులకు సాయం

చినగంజాం, మార్చి 29: మండలంలోని సోపిరాలకు చెందిన అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన దేశంశెట్టి కృష్ణమూర్తికి చెందిన రూ.60వేల విలువ కలిగిన గడ్డివాము, మొట్టు రామారావుకు చెందిన రూ.50వేల విలువ కలిగిన గడ్డివాములు ఈనెల 9న ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఈవిషయాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఏలూరి అగ్నిప్రమాదంలో నష్టపోయిన ఒక్కొక్కరికి రూ.పదివేలు సాయం చేశారు. ఎమ్మెల్యే ఏలూరి అందజేసిన ఆర్థిక సాయాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య ఆధ్వర్యంలో దేశంశెట్టి కృష్ణమూర్తి, మెట్టు రామారావుకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో చినగంజాం, మోటుపల్లి, నీలాయపాలెం సర్పంచ్‌లు రాయని ఆత్మారావు, వడ్లమూడి సాంబశివరావు, తూమాటి శ్రీనివాసరావు, నాయకులు షేక్ జిలాని, పర్వతరెడ్డి పార్థసారిధి, తుమ్మలపెంట చిన్నా, గంటా వెంకటనారాయణ ఎం.లక్ష్మయ్య, చల్లా జీవన్, పల్లపోలు శ్రీనివాసరావు, శిఖరం సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం, బెల్ట్‌షాపులపై దృష్టి సారించాలి

పర్చూరు, మార్చి 29: ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం అరికట్టడంతోపాటు, బెల్ట్‌షాపులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.గోవిందనాయక్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పర్చూరు ఎస్‌ఈబీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఓటర్లను ప్రభావితం చేసే తాయిలాలు, బహుమానాలు, వంటి వాటిని అరికట్టడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని అతిక్రమస్తే చర్యలు



పావులూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

ఇంకొల్లు, మార్చి 29: ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని పావులూరు, నక్కలపాలెం గ్రామాలలో శుక్రవారం బీఎస్ఎఫ్, పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాలలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

నూతలపాడు(పర్చూరు), మార్చి 29: మండలంలోని నూతలపాడు గ్రామంలో శుక్రవారం సీతారాములవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. కల్యాణ వేడుకల్లో దంపతులు పాల్గొని స్వామివార్ల కల్యాణ కార్యక్రమం చేపట్టారు. వేద పండితుల సారథ్యంలో స్వామివారి వార్షిక కల్యాణ వేడుకలు జరిగాయి. కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే సాంబశివరావు పాల్గొని భక్తిని చాటుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త విన్నకోట రవి, సతీరావమ్మ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

గొట్టిపాటికి కలిసొచ్చిన మక్కెనవారిపాలెం

» నేడు ఆగ్రామం నుంచి

ఎన్నికల ప్రచారం ప్రారంభం

అద్దంకి, మార్చి29: రాజకీయ నాయకులకు ఎన్నికల ప్రచారం ప్రారంభించేందుకు సెంటిమెంట్‌లను ఎక్కువగా పాటిస్తుంటారు. ఈక్రమంలో గొట్టిపాటి రవికుమార్‌కు సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం కలిసివచ్చింది. గత నాలుగు సార్లు మక్కెనవారిపాలెం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించి వరుస విజయాలు సాధించారు. మార్టూరు నియోజకవర్గం నుంచి 2004లో తొలిసారి పోటీచేసి గెలుపొందారు. ఆతర్వాత నియోజకవర్గం రద్దు కావటంతో 2009 నుంచి వరుసగా అద్దంకి నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలుస్తున్నారు.

5వ సారి పోటీచేస్తున్న రవికుమార్ శనివారం ఎన్నికల ప్రచారం మక్కెనవారిపాలెం నుంచి ప్రారంభిస్తున్నా రు. దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రచారం ప్రారంభించనున్నారు. ఐదవసారి కూడా గొట్టిపాటికి మక్కెనవారిపాలెం సెంటిమెంట్ బాగా కలిసివచ్చి అత్యధిక మెజార్టీ తో గెలుస్తారన్న విశ్వాసాన్ని టీడీపీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నారు.

రాతి ముఖమండపం నిర్మాణానికి విరాళం

అద్దంకి, మార్చి 29: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో రాతి ముఖ మండపం నిర్మాణానికి భక్తులు రూ.3 లక్షలు అందజేశారు. ఒంగోలుకు చెందిన మన్నం వీరాంజనేయులు జ్ఞాపకార్థం కుమార్తెలు అనూరాధ, అనుపమ, అనురూపలు శుక్రవారం దేవస్థానం సిబ్బంది కి విరాళం అందజేశారు.

అడుగంటిన మంచినీటి చెరువులు

» ఉన్ననీరు కలుషితం.. ఆపై దుర్గంధం

» ఆ నీటితోనే కాలం

వెల్లబుచ్చుతున్న ప్రజలు

పర్చూరు, మార్చి 29: పర్చూరు నియోజకర్గంలో తాగునీటి చెరువులు అడుగంటుతున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో పూర్తిగా అడుగంటగా కొన్ని చెరువుల్లో రేపో మాపో అన్నట్లుగా పరిస్థితి ఉంది. ఉన్న అరాకొరా నీరు కాస్త రంగుమారి కలుషితంగా ఉన్నాయి. దీనికి తోడు దుర్గంధం వెదజల్లటంతో గత్యంతరం లేక అదే నీటితో కాలం వెల్లబుచ్చాల్సిన దుస్థితి నెలకొంది. చెరువుల్లో ప్రస్తుతం ఉన్ననీటిని ఆయా పంచాయతీల కుళాయిల ద్వారా రెండు నుంచి మూడు రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నారు. దీంతోపాటు వేసవి నేపథ్యంలో రోజు రోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతకు చెరువుల్లో ఉన్న కొద్దిపాటి నీరుకాస్త అడుగుంటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చెరువుల్లో ఉన్న నీరు కాస్త కలుషితంగా మారిపోవటంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. నిరుపేదలు మాత్రం పంచాయతీల ద్వారా సరఫరా చేస్తున్న కలుషిత నీటితోనే సరిపెట్టుకుంటున్నారు.

పొంచిఉన్న నీటి ఎద్దడి...

ఇప్పటికే అనేక గ్రామాల్లో చెరువులు అడుగంటడం, ఉన్న నీరుకాస్త రంగుమారి కలుషితంగా తయారు కావటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెరువులను నింపుకుందామన్నా ఎక్కడా అందుబాటులో నీరు లేకపోవటంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలో ఎన్ఎస్‌పీ పరిధిలో 63, కేడబ్ల్యూసీ పరిధిలో 18 ఉన్నాయి. దాదాపు ఉన్న అన్నీ చెరువులు అడుగంటి పోయి కనిపిస్తున్నాయి.



నాగులపాలెంలో ఎండిపోయిన మంచినీటి చెరువు

మూగ జీవుల పరిస్థితి దయనీయం...

ఓ పక్క మండే ఎండలు, మరో పక్క చెరువుల్లో నీరు అడుగంటడం, పంచాయతీల ద్వారా నీరు సక్రమంగా సరఫరా కాకపోటంతో చాలీ చాలని నీటితో మూగజీవాల పరిస్థితి దయనీయంగా మారింది.



పర్చూరు చెరువులో రంగుమారి అరకొరగా ఉన్న నీరు

ప్రస్తుతం నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని వారం రోజుల్లో తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తామని అధికారులు ప్రకటించారు. అయితే పర్చూరు ప్రాంతం సాగర్ కాలువ ఆయకట్టు చివరి ప్రాంతం కావటం, ఉన్న సాగర్ కెనాల్‌లలో చిల్లచెట్లు పెరిగి పోవటంతో నీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారింది.

అధికారులు సకాలంలో స్పందించి, ప్రత్యేక చొరవ చూపితే తప్ప చెరువులకు పూర్తిస్థాయిలో నీరు చేరే పరిస్థితి లేదు. కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి ఆయకట్టు చివర ఉన్న పర్చూరు ప్రాంత చెరువులకు నీటిని నింపితేనే వేసవి గండం నుంచి ప్రజలు బయట పడే అవకాశం ఉంది. ఆదిశగా జిల్లా అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాబోయేది కూటమి ప్రభుత్వమే!

పంగులూరు, మార్చి 29: రాబోయేది కూటమి ప్రభుత్వమేనని ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు నాలుగు వేల రూపాయల పెన్షనుపై తొలి సంతకం చేస్తారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఈవిషయమై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం ముప్పవరంలోని పార్టీ కార్యాలయంలో జాగర్లమూడివారిపాలెం, అలవలపాడు, తక్కెళ్లపాడు, నూజిళ్లపల్లి, మల్లవరం, కొండమూరు గ్రా మాలకు చెందిన పార్టీ నేతలతో విడివిడిగా రవికుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం మ్యానిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. సంక్షేమం పేరిట రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ రెడ్డేనని పేర్కొన్నారు. ఉపాధి లేక రాష్ట్ర యువత భవిత పూర్తిగా అంధకారంలోకి వెళ్లిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. మరలా జగన్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఎవరూ బతికే పరిస్థితి ఉండదన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు డీఎస్సీని ప్రకటించి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. మే 13 న జరగనున్న ఎన్నికల పోలింగ్‌లో ఓటు అనే ఆయుధంతో జగన్ పాలనకు చరమగీతం పాడేందుకు టీడీపీ శ్రేణులు గ్రామాలలో ప్రజలను సమాయత్తం చేయాలని రవికుమార్ పిలుపునిచ్చారు.

విద్యార్థికి ఆర్థికసాయం

అద్దంకి, మార్చి 29: వైద్య ఖర్చుల కోసం విద్యార్థికి రూ.15,016ల ఆర్థిక సహాయాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సమకూర్చి ఫోన్‌పే ద్వారా శుక్రవారం పంపించారు. చిత్తూరు జిల్లా గుడిపాలకు చెందిన భాస్కరాచారి కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు కురుముల సూర్యం డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. నరాలు, కీళ్ళ వ్యాధితో బాధపడుతుండగా ఆస్తులు అమ్మి సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేశారు. ఇంకా నగదు అవసరమని తెలుసుకున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుందుర్తి సీతారామాంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి పొన్నపల్లి బ్రహ్మానందంల ద్వారా రూ.15,016 సేకరించి ఫోన్ పే చేశారు.

పొంచిఉన్న తాగునీటి ఎద్దడి

ఇంకొల్లు, మార్చి 29: ఇంకొల్లులో మంచినీటి చెరువులు అడుగంటుతున్నాయి. గ్రామానికి మంచినీటి అందించే పెద్దచెరువు, నాగులచెరువులలో నీరు పూర్తిస్థాయిలో తగ్గింది. మరో వారం రోజులకు మించి నీటిసరఫరా జరగని పరిస్థితి నెలకొంది. సాగర్ జలాలతో చెరువులను నింపకపోతే వేసవిలో నీటి ఎద్దడి సమస్య తీవ్రమవుతుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని కొన్ని గ్రామాలలో ట్యాంకర్లతో నీటిని తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇంకొల్లులోని రెండు మంచినీటి చెరువులను పూర్తిస్థా యిలో సాగర్ జలాలతో నింపకపోతే తీవ్రఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందని పేర్కొన్నారు.

అరాచక పాలనను అంతమొందించాలి

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

పంగులూరు, మార్చి 29: అరాచక, అవినీతి, దుర్మార్గపు పాలన బారి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు టీడీపీని ఆదరించాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ముప్పవరం గ్రామంలోగల పార్టీ కార్యాలయంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగువాడి ఆత్మగౌరవ ప్రతీక, సామాన్యుడి గొంతుకగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని చెప్పారు. టీడీపీ అధికారం కోసమో, స్వలాభం కోసమో ఆవిర్భవించిన పార్టీ కాదన్నారు. నాలుగు గోడల మధ్యకే పరిమితమైన రాజకీయం తెలుగుదేశం ఆవిర్భావంతో సామాన్యుని ముంగిటకు చేరిందన్నారు.

మదరాసి పరదాల మాటున మగ్గిపోతున్న తెలుగుజాతి ఔన్నత్యానికి టీడీపీ ఆవిర్భావం ద్వారా ఎన్టీఆర్ వెలుగును ప్రసాదించారన్నారు. చంద్రబాబు హయాంలో ఆ వెలుగు విశ్వవ్యాపితం అయ్యిందన్నారు. ఎన్నో సవాళ్లను, ప్రతికూల పరిస్థితులను తట్టుకుని మనుగడ సాగించడం తెలుగుదేశం పార్టీకే చెల్లిందన్నారు. నేడు చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్, బీసీ డిక్లరేషన్, కలలకు రెక్కలు వంటి పథకాలు అన్నివర్గాల ప్రజలకు ఉపయుక్తంగా ఉండేవన్నారు. రాష్ట్ర సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కేవీ సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, ఏడుకొండలు, కర్రి పరమేష్, చింతల సహదేవుడు, ఆదిశేఖర్, మస్తాన్‌వలి, వరపర్ల సుబ్బారావు, ఆదిరెడ్డి, చిన్నా, రవి, గరిమిడి జగన్, కోమటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ముప్పవరంలో టీడీపీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రవికుమార్



ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలుపుతున్న వైసీపీ అద్దంకి పట్టణ నేతలు

టీడీపీలో చేరిన వైసీపీ అద్దంకి పట్టణ నేతలు

అద్దంకి, మార్చి 29: అద్దంకి పట్టణంలో పలు సామాజిక వర్గాలకు చెందిన వైసీపీ నేతలు శుక్రవారం పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, 19వ వార్డు కౌన్సిలర్ యేజెండ్ల నాగరాజు ఆధ్వర్యంలో జొన్నతాళి వద్ద క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. వచ్చే ఎన్నికలలో టీడీపీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఇక్కుర్తి కొండలు, కావూరి నాగమ్మ, దామా భాస్కర్, అద్దంకి హనుమంతరావు, బత్తుల మోహనరావు, పులగల రామయ్య, గోరంట్ల కోటేశ్వరరావు, గోరంట్ల కోటేశ్వరరావు, దేవరకొండ వీరాంజనేయులు, వీరగంధం వెంకటరావుతో పాటు పెద్ద సంఖ్యలో వెళ్ళి ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపారు.

టీడీపీలో చేరిన వైసీపీ ద్రోణాదుల నేతలు

మార్టూరు, మార్చి 29: మండలంలోని ద్రోణాదులకు చెందిన వైసీపీ నేతలు తెలుగుదేశం పార్టీలో చేరారు. శుక్రవారం మండలంలోని ఇసుకదర్శిలో గల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. మాజీ సొసైటీ అధ్యక్షుడు, పాల కేంద్రం అధ్యక్షుడు పావులూరి మార్కెండేయులు, మూడవ వార్డు మెంబరు పాలెపోగు దిబ్బయ్య, ఆవుల దానయ్య, వెంపరాల హరీష్, వెంపరాల అజయ్‌కుమార్, మాచవరపు నాగేశ్వరరావు, కందుల అఖిల్, పల్లెపోగు రమణయ్య, పల్లెపోగు రాంబాబు, గోగుమళ్ల రామారావు తదితరులు పార్టీలో చేరారు.

ఈసం దర్భంగా వారితో ఏలూరి మాట్లాడుతూ అందరూ సమన్వయంతో పనిచేసి వచ్చే ఎన్నికలలో గ్రామంలో టీడీపీకి మంచి మెజారిటీ తీసుకురావాలన్నారు.

టీడీడీలో చేరిన నాయీబ్రాహ్మణులు

చినగంజాం, మార్చి 29: చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని చుండిబజారుకు చెందిన వైసీపీ నాయీబ్రాహ్మణులు శుక్రవారం రాత్రి మార్టూరు మండలం ఇసుకదర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు రామాంజనేయులు, చినగంజాం నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొండపాటూరి వెంకటేష్, ఉపాధ్యక్షుడు మాచవరపు బాలసుబ్రమణ్యం, మాచవరపు కృష్ణ, మాచవరపు ఆంజనేయులు, మాచవరపు శ్రీనివాసులు, మల్లికార్జున, లక్ష్మయ్య, ఎం.వెంకటరత్నం, ఎం.అనూష, ఎం.సీతామహాలక్ష్మి, కొండపాటూరి మాధవి, మార్కాపురం నాగేశ్వరి, మాచవరపు వెంకటేశ్వర్లు తదితరులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో టీడీపీలో చేరారు.



ఏలూరి సమక్షంలో చేరిన నాయీబ్రాహ్మణులు



ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన ద్రోణాదుల వైసీపీ నేతలు

15 కుటుంబాలకు ఎమ్మెల్యే టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, మోటుమర్రి రామసుబ్బారావు, సందు శ్రీనివాసరావు, టి.జయరావు, నరహరి శ్రీనివాసరావు, టి.చిన్నా, కె.రాముడు, గంటా వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.